🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☏ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 21 | 20-02-2023 | పుటలు : 4


## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

( ఫిబ్రవరి 21 )




శబ్దం పరబ్రహ్మ స్వరూపం. భాష సాక్షాత్తు ఆ శబ్దబ్రహ్మ సృష్టి. ప్రతి అక్షరంలో అనంతమైన బీజశక్తి ఉంది. అక్షరమంటేనే 'నాశనం లేనిది,నాశనం కానిది'అనిఅర్థం.శబ్దానికి భాష ఆత్మవంటిదైతే భాష తన సౌందర్యంతో శబ్దాన్ని అలరించేలా చేస్తుంది. వాక్కు - అర్థం, ప్రకృతి - పురుషుడు వేరు చేయలేనివి. వేరు కానివి. వేరుగా మనలేనివి. భగవంతుడు మనకు భావవ్యక్తీకరణకు ఇచ్చిన మాటను(భాషను) పవిత్రంగా, గౌరవంగా, ఆత్మీయంగా, శుభప్రదంగా, ఆనందమయంగా వినియోగిస్తే ఈ సమాజం అమృతమయమవుతుంది. మంచి మాటలతో ప్రతి దినచర్యను పూర్తిచేస్తూ జీవించాలని ఆకాంక్షిస్తూ అందరికీ 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ' శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

## మంచిమాట



"మధుమతీమ్ వాచం వదతు శాంతిం వా"

భాష మానవునికి మాత్రమే లభించిన అతి అరుదైన వరం. భావవ్యక్తీకరణకు భాష మాత్రమే స్పష్టమైన ఆధారం. అందుకే మాట "మధురంగా ఆనందం కలుగజేసేదిగా ఉండాలని అది శాంతిని కలిగిస్తుందని" భారతీయ సాహిత్య ప్రబోధం!!

# నన్నయలో ఘనంగా కామర్స్ ఫెస్ట్





**17.02.23**
**(మీడియాసెల్)**

నన్నయలో ఘనంగా కామర్స్ ఫెస్ట్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కామర్స్ ఫెస్ట్ ను కమర్షియో 2 కె 23 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లతో పాటు అనుబంధ కళాశాలల నుండి బీకామ్, ఎంకామ్ విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శుక్రవారం యూనివర్సిటీ కన్వేన్షన్ సెంటర్ లో జరిగిన కమర్షియో 2కె23 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అకౌంటింగ్ కీలక పాత్రను పోషిస్తుంది. ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయి. జి.ఎస్.టి., ఫైనాన్షియల్ అన్ని విషయాలలోను కామర్స్ విద్యార్థులు పట్టు సాధించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యకు జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ క్రియేటివ్ వే ఫ్రమ్ ఆర్డినరీ టూ ఎక్స్ట్రార్డినరీ థీమ్ తో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులంతా ఎక్స్ ట్రా గా పని



చేయడానికి, ఉన్నతంగా ఆలోచించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రోగ్రామ్ డైరక్టర్ ఆచార్య ఎస్. టేకి, కన్వీనర్ విభాగాధిపతి డా ఎన్. ఉదయభాస్కర్, కోకన్వీనర్స్ డా.పి. ఉమామహేశ్వరిదేవి, కామర్స్ విద్యార్థులు విశ్వవిద్యాలయంలో నిర్వహించే కమర్షియో ప్రాధాన్యతను తెలియజేసారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోని నూతన ఉత్సాహం, నూతన ఆలోచనలు కలుగుతాయని తెలియజేసారు. తరువాత ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, చార్టేడ్ అకౌంట్ ఎం.నారాయణ, గెయిల్ డి.జి.ఎం కె.వి.నారాయణ, హెచ్.ఆర్. బాలాజీ కమర్షియో 2కె23 లో హాజరైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉపన్యసించారు. అనంతరం కమర్షియో 2కె23 లో ప్రధానంగా క్వీజ్, మాచింగ్ అకౌంటింగ్, లాజికల్ కామర్స్, స్పిల్ డౌన్, మెమోరి టెస్ట్ వంటి అకడమిక్ అంశాలపై పోటీలను నిర్వహించారు. వివిధ గేమ్స్ ను కామర్స్ విద్యార్థులు నిర్వహించారు. మధ్యాహ్నం కనెన్షన్ సెంటర్ లో నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాటలతోను, నృత్య ప్రదర్శనలతోను సందడి చేసారు. ఆయా పోటీలలో ప్రతిభ కనపరచిన ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు డా.జి.అలీస్ జోయ్, డా.ఎం.రమేష్, డా. జి. రాజేంద్రప్రసాద్, డా.ఎ.పద్మవల్లి, జె.రవిశంకర్, డా.ఎం.అమ్మిరెడ్డి, .సత్యనారాయణరాజు, ఎం.జోహార్ కృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.












## సంపాదకీయం




# భాష

భాష మహిమ మన పూర్వీకులకు బాగా తెలుసు. అందుకనే వారు పొరపాటున కూడా అమంగళకరమైన మాటలను పలకవద్దని చెబుతారు. మధురమైన, శుభకరమైన మాట వలన మంచి జరుగుతుంది. కఠినమైన, క్లిష్టమైన, అసాధ్యమైన పనులు కూడా మధురమైన సంభాషణల వలన సఫలీకృతమౌతాయి.

ఉద్వేగం కలిగించకుండా, ప్రియంగా, హితంగా పలకటం ఒక విధమైన తపస్సు. దానిని 'వాచిక తపస్సు' అంటారు. ఏ భాష అయినా మనిషికి మృదువైన,హితమైన, ప్రియమైన మంచి మాటల్ని జనజీవన వ్యవహారంగా అందించింది. ఆ మాటలతోనే అన్ని భాషల్లోనూ కవిత్వం, పాట, కథ, నవల... ఇవన్నీ పుట్టుకొచ్చాయి.

శబ్దం యొక్క విశిష్టమైన పరిణామమే వాక్కు. అదే భాష. సృష్టికి కారణమైన ప్రణవ నాదమే ఓంకారం. అకార,ఉకార,మకార సంయుక్తాక్షరమది. పరమాత్మ స్వరూపం. పరమేశ్వరుని ఢమరుకం నుండి శబ్దాలు ఏర్పడ్డాయట. మాహేశ్వర సూత్రాలు అంటారు. వాటిలోంచే అక్షరాలేర్పడ్డాయి. అక్షర సమూహమే వాక్కు. అది భాషగా పరిణమిస్తుంది. కొన్ని భాషలకు లిపి ఉంటుంది. లిపిలేని భాషలు ఈ ప్రపంచంలో వేలకొద్దీ ఉన్నాయి. అన్నింటిలోనూ సాహిత్యం ఉంది.

ఏ భాషలోనైనా మాట్లాడే మాటే మనిషి అల్పత్వాన్ని,ఔన్నత్యాన్ని సూచిస్తుంది. ఉన్నతత్వాన్ని సూచించేది మౌనం లేదా సుతిమెత్తని శబ్దాలైతే, ఎక్కువ శబ్దం చేయటం అల్పత్వాన్ని సూచిస్తుంది. పాదాలను అలంకరించిన మంజీరాలు శబ్దం చేస్తుంటే, కంఠహారం చప్పుడు చేయదని కవుల చమత్కారం.

'అల్పుడెపుడు పలుకు ఆడంబరముగాను, సజ్జనుండు పలుకు చల్లగాను' అంటారు వేమన. ధ్వనించటంలో అల్పమైన కంచును, అనల్పమైన బంగారానికి సాపత్యం చెప్పారాయన.

ఏదేమైనా క్రమశిక్షణ, సంస్కారం, నియమాలతో జీవించేవారిలోంచి శుభప్రదమైన వాక్కులు, పదాలే వెలువడుతుంటాయి. శబ్దార్థ స్వరూపమైన భాషే ఈ లోకాన్ని నడిపిస్తోంది.

కాళిదాస మహాకవి రఘువంశం కావ్యంలో ప్రార్ధన శ్లోకంగా'వాగర్ధావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే' అని వాక్కు, అర్థం ఆదిదంపతుల స్వరూపమని వర్ణించారు.

కాబట్టి దైవ స్వరూపమైన భాషను మనలోంచి మంచి మాటలుగా,ఎదుటివారికి మహదానందాన్ని కలిగించేవిగా, సమాజ హితాన్ని, చైతన్యాన్ని కలిగించేవిగా వర్తించటమే మనం చేయదగిన పని. బహుశా భాషా దినోత్సవాల పరమార్థం ఈ కర్తవ్యాన్ని గుర్తు చేయటానికే కాబోలును!!

# నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**17.02.23 (మీడియాసెల్)**

విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో రిసెంట్ ట్రెండ్స్ ఇన్ వైర్ లెస్ కమ్యూనికేషన్ అనే అంశంపై సెమినార్ మరియు ఈఐఈ విభాగం ఆధ్వర్యంలో డిజైన్ అండ్ కంట్రోల్ సిస్టమ్ యూజింగ్ లాబ్ వ్యూ అనే అంశంపై రెండు రోజుల వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువత ఎక్కువ కలిగిన దేశం భారతదేశమని, యువశక్తిని సమర్థవంతంగా ఉపయోగించుకుటూ నూతన ఆవిష్కరణలు చేపట్టాలని అన్నారు. సాంకేతికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన జర్మనీ యూనివర్సిటీలలో ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్ళిన విద్యార్థులు అధికంగా ఉంటున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో ఇంజనీరింగ్ విద్యలో రాణిస్తూ వినూత్న ప్రయోగాలను చేయాలన్నారు. తరువాత ఎన్.ఐ.టి. తాడేపల్లిగూడెం అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.నరసింహరావు రిసెంట్ ట్రెండ్స్ ఇన్ వైర్ లెస్ కమ్యూనికేషన్ అనే అంశంపై ఉపన్యసించారు. సి.ఎస్.ఐ.ఆర్.–ఐ.ఎం.ఎం.టి భువనేశ్వర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.బి.సంతోష్ కుమార్ డిజైన్ అండ్ కంట్రోల్ సిస్టమ్ యూజింగ్ లాబ్ వ్యూ అనే అంశంపై ఉపన్యసించారు. అనంతరం ఇంటర్న్ షిప్ లో ప్రతిభ కనపరచిన విద్యార్థులు మౌనిక, ఉమమహేశ్వరిలకు వీసీ సర్టిఫికెట్టులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.వి.పెర్సిస్, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, కన్వీనర్స్ బి.సుధాకిరణ్, జె.హనుమంత మరియు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

## రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో

# నన్నయ ఎంవోయు

**17.02.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ బోటనీ విభాగం సువాస స్టూడెంట్ క్లబ్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ రాజమహేంద్రవరం మధ్య అవగాహన ఒప్పందం (MOU) కుదుర్చుకున్నారు. శుక్రవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో జరిగిన ఎంవోయు కార్యక్రమంలో వీసీ జి.వి.ఆర్. ప్రసాదరాజు సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఐ.ఎ.ఎస్. లు సంతకాలు చేసి అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఐ.ఎ.ఎస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల కొరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఇద్దరి మధ్య సన్నిహిత సహకారం ప్రధానంగా ఉంటుందని, వారి నైపుణ్యాలను పెంపొందించడానికి విద్యార్థి సమాజానికి ప్రయోజనం మరియు వ్యర్థాల ప్రాసెసింగ్ మరియు ట్రీట్‌మెంట్‌లో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం అన్నారు. ప్రజారోగ్యం, పారిశుధ్యం మరియు ఘన, ద్రవ వ్యర్థాలపై నిపుణుల సలహాలు అవసరమన్నారు. వ్యర్థాల నిర్వహణ – బయోడిగ్రేడబుల్‌ను రీసైకిల్ చేయడం మరియు పునర్వినియోగం చేయడం, వ్యర్థాలు, జీవఅధోకరణం చెందని వ్యర్థాలను సురక్షితంగా పారవేయడం, ఇతర స్వచ్ఛ భారత్ మిషన్ యొక్క ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ధోరణి, శిక్షణ మరియు వ్యవస్థాపకత మార్గాలు, చెత్త నిర్వహణ, వ్యూహాత్మక వార్డుల వారీగా మున్సిపల్ వ్యర్థాలు, పారవేయడం, డిస్పోజబుల్స్ సేకరణ వంటి నూతన ఆలోచనలతో ముందుకు వెళ్తామన్నారు. భవిష్యత్ లో విశ్వవిద్యాలయం సహకారంతో మిగిలిన విభాగలను కలుపుకుంటూ నూతన కార్యక్రమాలు చేపడతామన్నారు. వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు సమాజహితం కోసం పని చేస్తాయని సమాజ ప్రయోజనార్థమైన కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు స్టూడెంట్ కమ్యూనిటీ సర్వీస్ ప్రోజెక్టులను చేపట్టిందని విద్యార్థులు వాటిల్లో చురుగ్గా పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.హెచ్.ఓ డాక్టర్ వినూత్న, కార్పొరేషన్ అధికారులు సైదా, అన్నమయ్య, ఈసీ మెంబర్స్ ఆచార్య కె.శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, హాస్టల్ వార్డెన్ డా.డి.జ్యోతిర్మయి మరియు సువాస స్టూడెంట్ క్లబ్ మెంబర్స్ విద్యార్థులు పాల్గొన్నారు. బోటనీ విభాగాధిపతి డా.కె.శామ్యూల్ కుమార్, డా.వి.పద్మావతి, డా.ముత్యాలునాయుడు పాల్గొన్నారు..



ఎం.వో.యు పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

# రాజకుమార్ రెడ్డికి డాక్టరేట్



కాకినాడ రూరల్ తిమ్మాపురంలో గల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగంలో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న పల్లాల రాజకుమార్ రెడ్డి ఆంధ్ర యూనివర్సిటీ నుండి డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. రాజనీతి మరియు ప్రభుత్వ పాలన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య పి. అరుణ్ కుమార్, డాక్టర్. పి. ప్రేమానందం పర్యవేక్షణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల్లో గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యం అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ కే. జోసఫ్ స్టీఫెన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ కమల కుమారి, సహాయ ఆచార్యులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాని బాబు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ గోపి, హైకోర్టు న్యాయవాది సన్నపు కుమారస్వామి, లలితకుమారి, రాజ్ కుమార్ మరియు విద్యార్థిని విద్యార్థులు శాలువాతో సత్కరించి అభినందించారు.

# యూనియన్ బడ్జెట్ ఫర్ డిజిటల్ ఇండియా

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ నందు డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో నేషనల్ వర్క్ షాప్ ఆన్ యూనియన్ బడ్జెట్ ఫర్ డిజిటల్ ఇండియా 2023 అనే అంశంపై ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి మరియు కన్వీనర్ డా.డి అజయ్ రతన్ కన్వీనర్ గా క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి ముఖ్య అతిథిగా, చార్టెడ్ అకౌంట్ టి. భాను పృధ్వీరాజ్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డా.కమల కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశం 75 స్వేచ్ఛా వసంతాలు పూర్తి చేసుకుని వంద సంవత్సరాల స్వతంత్ర భారతావని వైపు పరుగులు తీస్తూ ఒక అమృత కాలాన్ని ఏర్పాటు చేసే దిశలో వెళ్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఆ దశలో భారత దేశంలో ప్రవేశపెట్టే బడ్జెట్ దేశముఖ చిత్రాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డీసీఎంఎస్ డిపార్ట్మెంట్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్య వక్త చార్టెడ్ అకౌంటెంట్ టి. భాను పృధ్వీరాజ్ విద్యార్థులను బడ్జెట్ అనగానేమి అది ఏ విధంగా మన భారతదేశంలో రాబోవు తరాలను చేస్తుంది భారత రాజ్యాంగంలో బడ్జెట్ పై పొందుపరిచిన విశేషాలు మరియు ఈ ఆధునిక భారతానికి ఈ సంవత్సరం ఉన్న బడ్జెట్ ఏ విధంగా సహాయపడుతుంది, అలాగే కొత్త బడ్జెట్ ద్వారా ఎక్కువ మోతాదులో కేటాయించబడ్డ అతి ముఖ్యమైన వివిధ రంగాల గురించి, అలాగే మధ్యతరగతి వారి మీద భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన బడ్జెట్ విధానాల




గురించి, కొత్త బడ్జెట్ విధానాలు మరియు డిజిటల్ ఇండియా దిశగా భారత దేశంలో కొత్తగా కేటాయించిన వివిధ రంగాల బడ్జెట్ విధానాల గురించి క్షుణ్ణంగా విసిదీకరించారు. పిదప విద్యార్థులకు గల సందేహాలను ఆయన ముఖాముఖి పద్ధతిలో విశదీకరించారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీరామరాజు, డా. మధు కుమార్ ,డా. శ్రీదేవి ,డా. అప్పారావు, మణికంటేశ్వర్ రెడ్డి , మనోజ్ దేవా మరియు డా. రజిత ,వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ విభాగ విజ్ఞాన సందర్శన

**14.02.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బీఈడీ ఎంపీఈడి విద్యార్థులు, అధ్యాపకులు విజ్ఞాన పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరంలో వివిధ ప్రాంతాలను సందర్శించారు. మంగళవారం యూనివర్సిటీలో ప్రారంభమైన విజ్ఞాన సందర్శన ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్, రాళ్లబండి మ్యూజియం, కందుకూరి వీరేశలింగం టౌన్ హాల్, దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ వంటి చారిత్రక సాంస్కృతిక ప్రాంతాలను సందర్శిస్తూ సాగింది. దీనికి సంబంధించిన వివరాలను ప్రిన్సిపాల్ డా. కె. సుబ్బారావు తెలియచేస్తూ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు ఆజాదీ కా




అమృత మహోత్సవాలలో భాగంగా స్థానిక చారిత్రక సాంస్కృతిక ప్రదేశాలను సందర్శించాలని సూచించారన్నారు. దీనిలో భాగంగా విశ్వవిద్యాలయ వీసీ, రిజిస్ట్రార్ ప్రోత్సాహంతో యూనివర్సిటీ బస్సులో విజ్ఞాన సందర్శన చేపట్టామన్నారు. ఉభయగోదావరి జిల్లాలకు జీవనాధారమైన కాటన్ బ్యారేజ్, మ్యూజియం వంటి చారిత్రక ప్రదేశాలను విద్యార్థులు పరిశీలించి కొత్త విషయాలను తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాతృభాషను రక్షించుకుందాం!

అమ్మ ఒడిలో ఆడుకుంటున్నప్పుడు ఎంత సంతోషంగా ఉంటుందో అమ్మ భాష మాట్లాడటంలో కూడా అంతే ఆనందంగా ఉంటుంది. పరాయి భాష మోజులో పడి మాతృభాషను మరిచిపోతున్న ఈ తరుణంలో మాతృభాషలను పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.


అందుకోసమే ప్రతిసంవత్సరం ఫిబ్రవరి 21న 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. దీనికోసం 1999 నవంబర్ 17న జరిగిన యు.ఎన్.ఓ 30 వ సాధారణ సభ సమావేశంలో 2000 సంవత్సరం నుండి ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించారు. దీని ముఖ్య ఉద్దేశం చిన్న, పెద్ద భాషలను కాపాడుకోవడం, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని భవిష్యత్ తరాలకు అందివ్వటమే.



మాతృభాషను కాపాడుకుంటూనే దాని ద్వారా ఇతర భాషలు నేర్చుకోవడం ద్వారా అనంతమైన విజ్ఞానాన్ని పొందవచ్చని యునెస్కో కూడా చెప్పడం జరిగింది.





అలాగే మన రాష్ట్ర విషయానికొస్తే మన తెలుగు భాష అంతరించిపోయే జాబితాలో ఉంది. చక్కని పలుకుబడులకు, నుడికారాలకు తెలుగు భాషే పుట్టినిల్లు. మన తెలుగు భాష దేశభాషల్లోకెల్లా గొప్పది. 'దేశభాషలందు తెలుగులెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు ఎప్పుడో చెప్పారు. అందువలన మాతృభాషను కాపాడుకునేందుకు ప్రభుత్వం, ప్రజలు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆంగ్ల భాషలో చదివితేనే ఉద్యోగం దొరుకుతుందని కోట్లాది తెలుగుపిల్లల భ్రమ. గతంలో కేవలం తెలుగులో చదివిన ఎంతోమంది ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందారన్న విషయం మర్చిపోవద్దు. "మీరు కోరినన్ని భాషలు నేర్చుకోండి కానీ మాతృ భాషను మీ రక్తంలో నింపుకోండి". ఎవరైతే మాతృభాషను సరిగ్గా నేర్చుకుంటారో వారు ఇతర భాషలను కూడా అదే స్థాయిలో నేర్చుకుంటారని మెకంజీ, వాకర్ లాంటి భాషా పరిశోధకులు చెప్పారు. అందువలన మాతృభాషను నిర్లక్ష్యం చేయకుండా మన భాష, సంస్కృతిని భవిష్యత్ తరాలవారికి అందివ్వడం మన కర్తవ్యంగా భావించాలి .


– బి.సుశాంత్ కుమార్




# చిత్రకళా ప్రపంచం






లలిత కళల్లో చిత్రలేఖనం (ఫైన్ ఆర్ట్స్) మహత్తరమైంది. చిత్రకళను ముందు వైపు నుంచి మాత్రమే దర్శించగలం. అందువల్లనే దాన్ని ఏకదిక్ సౌలభ్యంగల కళ అంటారు. అయినప్పటికీ నిపుణులైన చిత్రకారులు అన్ని దిక్కుల ఇంద్రజాలాన్ని సృష్టిస్తారు. సాహిత్య కళకు వ్యాకరణం ఉన్నట్లుగా చిత్ర రచనలకు కూడా ఒక విధమైన వ్యాకరణం ఉంటుంది. ఆ వ్యాకరణ నియమాలను పాటించి చిత్ర రచనలు చేస్తే ప్రేక్షకునికి రూపానందం కలుగుతుంది. దృశ్య జగత్తులోని సాధారణ రూపాలను అధిగమించటమే నవ్య స్రష్టల ఆదర్శం. రూపంలోని భావన నుండి రూపానికి అతీతమైన భావన స్థాయికి చేర్చడమే చిత్రకారుని ఆదర్శం. అటువంటి చక్కని చిత్రాలను విశ్వవిద్యాలయంలో ప్రదర్శించి మన్ననల్ని పొందారు ప్రముఖ చిత్రకారులు పి.సి. ప్రసాద్. కోనసీమలోని అమలాపురం ప్రాంతానికి చెందిన పిసి ప్రసాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.ఏ ఫైన్ ఆర్ట్స్ అభ్యసించారు. అమలాపురంలో ఆర్ట్ గ్యాలరీ మరియు స్టూడియో స్థాపించి విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్స్ లో శిక్షణ ఇస్తున్నారు. ఆర్ట్ గ్యాలరీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేశంలోని ప్రముఖ కళాకారులను ఆహ్వానించి లైవ్ క్యాంప్ జరిపి అందులోని చిత్రాలను ప్రదర్శనగా ఉంచారు. వాటిని నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల, అధ్యాపకుల సందర్శనార్థం విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. వారికి విశ్వవిద్యాలయం కృతజ్ఞతలు అందిస్తోంది.




## విద్యార్థులకు చిత్రకళా ప్రపంచం తెలియాలి




కలలకు కాణాచి, సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలో నన్నయ గారి పేరిట వెలసిన విశ్వవిద్యాలయంలో విద్యార్థి లోకం ఆర్ట్ గ్యాలరీలోని ఈ చిత్రాలను చూసి ప్రేరణ పొందుతారని, కళా ప్రపంచం సౌందర్యాన్ని తెలుసుకొని జీవితానికి అన్వయించుకోవడంలో ఆత్మానుభూతిని పొందుతారని నేను భావిస్తున్నాను. విశ్వవిద్యాలయంలో లలిత కళలలో ఒకటైన నృత్య కళ కు సంబంధించి కూచిపూడి డిప్లమా కోర్సుగా ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగిన విషయం. అలాగే విద్యార్థులకు మానసిక ఆనందాన్ని కలిగించే ప్రవృత్తిగా చిత్రకళ ద్వారా ఎంతో అనుభూతిని పొందే ఫైన్ ఆర్ట్స్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటమే కాకుండా విశ్వవిద్యాలయంలో ఒక ఆర్ట్ గ్యాలరీ లాంటి మ్యూజియం కూడా ఏర్పడుతుందని నేను భావిస్తున్నాను. అందుకు నా సహకారాన్ని కూడా అందించగలుగుతాను. ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేసినందుకు అనుమతి ఇచ్చిన విశ్వవిద్యాలయ అధికారులు అందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను

**పి.సి.ప్రసాద్, చిత్రకారులు,అమలాపురం**






ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in